కనిపించని భార్య కనిపిస్తే అతను ఎందుకు గుర్తుపట్టలేదు?

శ్రీమతి పి.రాధామహాలక్ష్మి కథ

# భార్య కనిపించడంలేదు

టేబిలుమీద టెలిఫోను మోగింది. అప్పుడే రిలాక్స్ అవుదామనుకుంటున్న డిటెక్టివ్ రాజ్ కుమార్ రిసీవరు తీసి చెవిదగ్గర పెట్టుకున్నాడు.

"హల్లో మీరు డిటెక్టివ్ రాజ్ కుమారేనా?"

"ఆ అవును. నేనే మాట్లాడుతున్నాను"

"మీరు మీ స్పెషల్ ఇన్వెస్టిగేషను పనిమీద అమెరికా వచ్చారు కదూ?"

"ఎవరు మీరు? మీకేం కావాలి" కొంచెం విసుగ్గా అడిగాడు డిటెక్టివ్ రాజ్ కుమార్.

"మీరు కోపగించుకోకండి. నాకో చిన్న సాయం చేసిపెట్టాలి. నేను మీరు అడిగినంత ఫీజు ఇచ్చుకుంటాను. మీరు ఒప్పుకోండి ప్లీజ్" అవతలి కంఠం ఫోనులో ప్రాధేయపడ్తున్నట్లుగా ఉంది.

"అమెరికాలాంటి గొప్ప దేశంలో మీకు డిటెక్టివ్ లే కరువయ్యారా? ఎక్కడో ఏదో చిన్న పనిమీద ఇండియానుంచి వచ్చిన నన్ను మీరు కోరుకోవడం చూస్తే ఆశ్చర్యంగా వుంది. ఇంతకీ నేనిక్కడికి వచ్చివుంటున్నట్లు మీకెవరు చెప్పారు?"

"డిటెక్టివ్ జేమ్స్. నేను మొదట ఆయనకే ఫోను చేసాను. ఆయన చాలా బిజీగా వుండి డిటెక్టివ్ బ్లేక్ కి చెయ్యమన్నాడు. ఆయనకూడా ఊపిరి సలపనంత పనిలో వున్నారని తెలిసి మళ్లీ డిటెక్టివ్ జేమ్స్ కే ఫోన్ చేసాను. మిస్టర్ జేమ్స్ మీ పేరు చెప్పారు. మీరు విజిటింగ్



ప్రొఫెసరు డాక్టరు రవి దగ్గర క్లీవ్‌లాండులో వుంటున్నట్లు చెప్పారు. రెండుమూడురోజుల్లో ఇండియాకి తిరిగి వెళ్లిపోతున్నట్లు కూడా చెప్పారు. ప్లీజ్ వీరు మీ జర్నీని పోస్టుపోను చెయ్యండి నా కోసం.''

''అసలు వీరెవరో వీరి కేసెలాంటిదో? నేను ఈ కంట్రీలో టేకప్

చెయ్యొచ్చో లేదో అన్నీ తెలుసుకోవాలి కదా! ఊఁ— వీలైతే మీరు పెర్సనల్‌గా వచ్చి మాట్లాడండి.''

''ఊఁ... హా... నేను రాలేను. నామీద హత్యా ప్రయత్నాలు జరుగుతున్నట్లు నాకు అనుమానంగా వుంది. నేను వీలైనంత ఫోనులోనే మాట్లాడుతాను. నా పేరు విలియమ్స్. నేను డెట్రాయిట్‌లో వుంటాను. పెద్ద వ్యాపారస్తుణ్ణి. మీరీ కేసు టేకప్ చేస్తానంటే డిటెక్టివ్ జేమ్స్ మీకు పర్మిషన్ కార్డు తెప్పిస్తామన్నారు. మీకింకా ఇంకొక నెల వీసా వుందిటకదా!''

''ఓ అయితే నా గురించి అన్నీ ముందే అడిగి తెలుసుకొని పెట్టుకున్నారన్నమాట. మీరుంటున్న 'డెట్రాయిట్ స్థలం మా క్లీవ్‌లాండుకి ఎంతో దూరం లేదు. మీరు రాలేకపోతే నేనే మీ ఇంటికి వస్తా నంబరివ్వండి.''

''వద్దులెండి అవసరమయితే నేనే కాగితాలూ అవీ తీసుకొని వస్తా. ప్రస్తుతం నేను క్లీవ్‌లాండులోనే వుంటున్నాను. అయితే ఇప్పుడు కేసు ఒప్పుకున్నట్లేనా?''

''ఆ ఒప్పుకున్నట్లే— అసలు విషయం చెప్పండి.''

''నా భార్య కనపడ్డంలేదు.''

''మిస్టర్ విలియమ్స్ మీ భార్య కన్పించకపోతే ఆ విషయం పోలీసులకి తెలియజెప్పాలి. పేపర్లలో ప్రకటించాలి. టీవిలో ప్రకటించాలి. అంతేకాని...''

''డిటెక్టివ్ రాజ్‌కుమార్ ప్లీజ్ ఈ విషయం పేపర్లలోను, టి.వి.లోను ప్రకటించి, పోలీసులకి చెప్పి ఆర్భాటం చెయ్యటం నాకెంత మాత్రం ఇష్టంలేదు.''

''ఓ అయామ్ సారీ అయితే ఆమె ఎప్పట్నుంచీ కన్పించడంలేదు?''

''రెండుమూడు రోజులనుంచీ....''

''ఓ! అంటే జూలై నాలుగవ తేదీ నుంచీ అన్నమాట....''

''ఆ కావచ్చును.''

''అసలు కారణం మీరేమని ఊహిస్తున్నారు విలియమ్స్?''

''నా భార్య చాల అందగత్తె. పైగా కొన్ని కోట్ల డాలర్లకి వారసురాలు. మేమిద్దరం చర్చిలో ఫాదరు ముందు వివాహం చేసుకున్నాం.''

''మీ భార్యకు మీరంటే ఇష్టమేనా?''

''నేనంటే పడిచస్తుంది. నా మీద వెర్రి ప్రేమ. నేను లేకుండా ఆమె ఒక్క క్షణం కూడా వుండలేననేది. నాలుగురోజుల క్రితం ఏదో చిన్న విషయంలో మాటా మాటా వచ్చి నేను కొంచెం విసుక్కున్నాను. అంతే ఆమెకి కోపం వచ్చి మాట్లడ్డం మానేసింది.

ఆ సాయంత్రం ఆమె వాళ్ల స్నేహితురాలు డెట్టీ దగ్గరికి వెళ్లినట్లు తెలిసింది.

ఇదివరకు కూడ ఒకటి రెండుసార్లు ఇలాగే డెట్టీ దగ్గర వుండిపోయి మర్నాడు నా వద్దకు వచ్చింది.

ఇప్పుడు నేను డెట్టీకి ఫోనుచేసి కనుక్కుంటే అసలు నా భార్య ఆమెవద్దకు

వెళ్లనేలేదని తెలిసింది.''

''మరెక్కడికి వెళ్లి వుంటుంది. ఆమె కెవరయినా ఇంకా స్నేహితులున్నారా?''

''ఏమో అవన్నీ నాకు తెలియవు. మీరు వెంటనే కేసు టేకప్ చెయ్యండి. దయచేసి ఇంకేమీ అడగొద్దు.'' అంటూ విలియమ్స్ ఫోను పెట్టేసాడు. విలియమ్స్ ఫోను పెట్టేముందు ఎవరో ఆడగొంతు 'హాయ్' అనడం రాజ్‌కుమార్‌కి వినబడింది.

డిటెక్టివ్ రాజ్‌కుమార్ మళ్లీ డయల్ చేద్దామనుకున్నా అతనివద్ద విలియమ్స్ ఫోన్ నెంబర్ లేదు. అవసరముంటే మళ్లీ విలియమ్సే చేస్తాడు. అతను చెయ్యకపోతే తనీ కేసు చూడక్కరలేదు. పోయిన శని ఆదివారాలు పని అయి రెస్టు తీసుకుందామనుకుంటే ప్రొఫెసరు రవి బలవంతంగా 'షికాగో'కి తీసికెళ్లాడు.

ఆవేళ జూలై నాలుగవ తేదీ అమెరికా దేశానికి స్వాతంత్ర్యం వచ్చినరోజు. షికాగోలో లేక్‌షోర్ (మిసిసిపి నది) దగ్గర ఆ చుట్టుపక్కలనుండి ఎంతోమంది ప్రజలు వచ్చి వేడుకలు జరుపుకుంటున్నారు.


అన్నింటిలోకి ముఖ్యమైనది ఆవేళపు దే ఫెస్టివల్. ప్రపంచంలోకెల్లా ఎత్తైన టవర్స్ సీయర్స్ టవర్స్. డెబ్బయ్ సెకనులలో లిఫ్టులో ఎక్కి పైనుంచి షికాగో పట్టణం అంతా చూడొచ్చు.

టవర్ నాలుగువైపులా నాలుగు దిక్కులనుండీ షికాగో అంతా ఎంతో అందంగా చూడముచ్చటగా వుంటుంది.

లేక్‌షోర్ మరీ అందంగా పడవలతో రంగు రంగుల బట్టలు వేసుకొన్న అమెరికన్లతో మిగతా దేశీయులతో కనుల విందుగా వుంది.

నిజానికి ప్రొఫెసరు రవే కనుక తనని బలవంతం చెయ్యకపోతే తనింతటి అందమైన రోజుని పోగొట్టుకునేవాడు.

ఈ విలియమ్స్ ఎవరో? ఏమో? నిజానికి తనకీ కేసు టేకప్ చెయ్యాలని



లేదు. ఈ రెండురోజులూ రెస్టు తీసుకొని ఇండియాకి. వెళ్లిపోవాలనుంది. డిటెక్టివ్ రాజ్‌కుమార్ సోఫాకమ్ బెడ్‌మీద అలాగే నడుం వాల్చాడు. కన్నులు మూతబడ్డాయి.

టేబిలుమీద ఫోను మోగింది. రెండవసారి ఫోను మోగుతుండగా లేచి రిసీవరు అందుకున్నాడు.

"హల్లో డిటెక్టివ్ జేమ్స్ హియర్"

"హల్లో డిటెక్టివ్ రాజ్‌కుమార్ స్పీకింగ్."

"మిస్టర్ విలియమ్స్ ఒక గంటలో మీ వద్దకు పదివేల డాలర్లు, కొన్ని వివరాలు పట్టుకువస్తాడు. అరగంటలో నేను మీకు వర్క్ పెర్మిషను కార్డు పంపిస్తున్నాను. మీరాతని కేసు టేకప్ చెయ్యండి. ఎన్నో క్లిష్టమైమ సమస్యల్ని ఇట్టే పరిష్కారం చేసిన మీకిది లెక్కలోకి రాదు. మీకేదైనా అర్జంటుగా అవసరం పడితే నాకు ఫోనుచెయ్యండి. ఆల్ ది బెస్ట్ సీ యూ" అంటూ డిటెక్టివ్ జేమ్స్ హడావుడిగా ఫోను పెట్టేసాడు.

జేమ్స్ అన్నట్లుగా అరగంటలోనే ఒకతను వచ్చి తనకు వర్క్ పెర్మిట్ కార్డు ఇచ్చి వెళ్లాడు.

సరిగ్గా గంటకి ఫోర్డు కారులో విలియమ్స్ కావచ్చును వచ్చి కారు దిగకుండానే కారులోంచి తనతో వచ్చిన అమ్మాయికి మా ఇంటి వివరాలు చూపి ఏవో కొన్ని కాగితాలు ఇచ్చి రమ్మన్నాడు.

ఇదంతా కిటికీలోంచి గమనిస్తున్న డిటెక్టివ్ రాజ్‌కుమార్ ఆ అమ్మాయి వచ్చి తలుపు తట్టగానే తీసాడు.

"లోపలికి రావచ్చునా..."

"రండి నన్ను రాజ్‌కుమార్ అంటారు కూర్చోండి."

"తెలుసులెండి. ఈవేళప్పుడు ప్రొఫెసర్ రవి వుండరనీ మీరొక్కరే వుంటారనీ మిస్టర్ విలియమ్స్ ఇవిగో మీకీ కాగితాలు, ఈ చెక్ ఇచ్చి రమ్మన్నారు. ఇన్వెస్టిగేషన్‌కు ఎంత డబ్బయినా చెప్పమన్నారు. ఇస్తామన్నారు. ఇంక వస్తానండీ" లేచిందావిడ వెళ్లడానికి ఉద్యమిస్తూ.

"మీ అందమైన పేరు తెలుసుకోవచ్చా" నవ్వుతూ అడిగాడు రాజ్‌కుమార్.

"పేరులో ఏముందిలెండి" నవ్వేసి బయలుదేరింది.

"ఇట్సాల్‌రైట్ మీరు వారికి సెక్రటరీయా?"

"అవుననుకోండి" అని నవ్వుతూ నిష్క్రమించింది. పైన తయారుగా వున్న ఆటోమేటిక్ కెమెరా ఆమెకి తెలియకుండా రక్కున ఫోటో తీసింది. డిటెక్టివ్ రాజ్‌కుమార్ ఈ అమ్మాయి వాలకం కనిపెట్టాల్సిందే ననుకున్నాడు. పొద్దున్న విలియమ్స్ ఫోను హడావుడిగా పెట్టేసేటప్పుడు వినిపించిన ఆడ గొంతు ఈమెదేనేమో?

కారు స్టార్టయ్యింది. కారు టర్న్ చేసుకొని వెళ్లడంలో విలియమ్స్ ముఖం కిటికీలోంచి స్పష్టంగా చూడగలిగాడు. ఆటోమేటిక్ కెమెరా కారుని ఫోటో తీసింది. "విలియమ్స్— విలియమ్స్

ఇతడిని ఎక్కడో చూసాను. పరిచయమైన ముఖం లాగానే వుంది. ఎక్కడ చూసానబ్బా! ఏ సందర్భంలో చూసానో జ్ఞాపకం రావటంలేదు'' అనుకున్నాడు రాజ్‌కుమార్.

రాజ్‌కుమార్ సోఫాలో కూర్చుని విలియమ్స్ పంపిన కాగితాలూ అవీ చూస్తున్నాడు.

అందులో విలియమ్స్‌కి చర్చిలో పెళ్లికావడం, ఆ ఫాదర్ దగ్గిర రిజిస్టరయిన కాగితాలూ అవీ వున్నాయి. ఎంత ఆలోచించినా రాజ్‌కుమార్‌కి విలియమ్స్‌ని ఎక్కడ చూసాడో జ్ఞాపకం రావడంలేదు.

ఎందుకో రాజ్‌కుమార్‌కి పనిమీద ఇవాళ మనసు పోవటంలేదు. హాయిగా రెస్టు తీసికొని ఇండియాకి వెళ్లిపోదామనుకొన్న తనకు డిటెక్టివ్ జేమ్స్ పెట్టిన భారం ఇది. ఇంతలో ప్రొఫెసరు రవి వచ్చేరు.

''రవీ నీకు ఇతణ్ణి ఎక్కడైనా చూసినట్లు జ్ఞాపకం వుందా!'' అంటూ రెండు ఫోటోలు రవి కందించాడు రాజ్‌కుమార్.

''ఏ కంట్రీలో వున్నా ఎక్కడికెళ్ళినా నీ డిటెక్టివ్ పని తప్పితే మరో ధ్యానం లేదా! నన్ను కాస్త వేడి వేడిగా టీ అన్నా తాగనివ్వు.'' అంటూ ఫ్రిజ్ తీసి ''అయ్యో బాటిలు మొత్తం ఖాళీ చేసేసేవేవిటయ్యా నేను మళ్లీ బజారుకి పోయి తెచ్చుకోవాలి'' అన్నాడు రవి.

''రవీ నువ్వెలానూ తాగవు కదా! అదీగాక టీ తాగుతానని ఫ్రిజ్ తీసి బాటిలు కోసం వెతుక్కుంటున్నావేమిటి?''

''డియర్ ఫ్రెండ్ రాజ్‌కుమార్—అందరి విషయాలూ డిటెక్టివ్‌గా కనుక్కోగలవేమోగాని నా దగ్గిర మాత్రం ఓడిపోయావు. నేను వెతుక్కున్నది కోక్ బాటిలు కోసం మాత్రమే. నవ్వు నీ రహస్యం బైటపెట్టుకున్నావు'' నవ్వుతూ అన్నాడు రవి.

''అయామ్ సారీ రవీ, నేను చెప్పిందీ నీ కోక్ బాటిలు గురించే. నీ బీరు బాటిల్స్ అదుగో ఆ వెనుకవైపున వున్నాయి. నువ్వేదో అవసరమైన పనిలో వున్నట్లున్నావు. నువ్వు కాస్సేపు ఆఫీసు దగ్గర కూర్చో. ఈ గదిలో కూలరు పనిచేస్తున్నట్లు లేదు. నేను నీకు టీ కలిపి తెస్తాను'' అన్నాడు రాజ్‌కుమార్.

రవి నవ్వుతూ సోఫా మీద కూర్చుని బూట్లు విప్పుకొని తాపీగా ఫోటోల వంక చూసాడు. ''రాజ్‌కుమార్! ఈ అమ్మాయి ఎవరో నాకు తెలియదుకాని ఈ రెండో



## ఆఫీసర్

''ఏమండోయ్... ఈనెల జీతం రాగానే నాకు పట్టుచీర తెస్తానన్నారు. ఏదీ'' గట్టిగా అడిగింది భార్య.

''ష్... ష్... గట్టిగా అరవకే... మన పక్కింట్లో ఇన్‌కంటాక్స్ ఆఫీసర్ దిగాడు. ఈసారినుండి నేను తెచ్చేదాకా అడగకు.'' బెదిరించాడు భర్త.

ఎం.డి.హాఫిమొద్దీన్ (రెబ్బెన)

ఫోటోలో అతన్ని మాత్రం మనం షికాగో వెళ్లినప్పుడు కలిశాం.''

టీ తెచ్చిచ్చిన రాజ్‌కుమార్‌కి ముఖం వికసించింది.

''సీయర్స్ టవర్స్‌లో ఒకసారి చూసాము. ఇతనిని, ఇతని భార్యనీ నేనే ఫోటోలు తీసాను. తిరిగి అతను నీకూనాకూ ఫోటోలు తీసిపెట్టాడు. మళ్లీ వీళ్లిద్దరూ ఫుడ్‌ఫెస్టివల్లోనూ, ఆ తర్వాత వాళ్లు 'లేక్‌షోర్'కి వెళుతూనూ కూడ కన్పించారు.'?

అవును ఈ విలియమ్స్ అతడే సందేహం లేదు. అతనితోవున్న ఆమెను తన భార్యగా మాకు పరిచయం చేసాడు కూడాను. ఆమె నిజంగా చాలా అందగత్తె. ఎవ్వరైనా ఆమెనొకసారి చూస్తే చాలు ఆమెనలా చూస్తూ ఆరాధిస్తూ వుండిపోవాలినిపిస్తుంది.

విలియమ్స్ ఆమె నడుం చుట్టూ చేయివేసి నడిపిస్తూ ఆ టవర్ నాలుగు దిక్కులనుండీ కిందికి చూపిస్తూ నవ్వుతూ ఏమేమో మాట్లాడడం ఇవన్నీ గమనించకపోలేదు.

రెండుమూడుసార్లు మధ్యలో విలియమ్స్ ఆమెను గాఢంగా కౌగిలించుకొని ముద్దు పెట్టుకున్నాడు కూడాను'' రాజ్‌కుమార్‌కి అంతా జ్ఞాపకమొచ్చింది.

''రాజ్‌కుమార్ ఇవిగో నీ ఫోటోలు ఇక్కడ పెట్టాను. రా మనం బయటికి వెళ్లి అలా తిరిగి వద్దాము.''

''నువ్వెళ్ళు రవీ. నేను అర్జంటుగా కొన్ని ఫోన్లు చేసుకోవాలి.

''అయితే మళ్లీ ఏదో ఇన్వెస్టిగేషనులో పడ్డావన్నమాట. ఓ.కె. గెట్ ఎలాంగ్—ఆల్ ది బెస్ట్'' అంటూ ప్రొఫెసరు రవి ఒక్కడే బయటికి వెళ్ళాడు.

అతనలా బయటికి వెళ్లగానే డిటెక్టివ్ రాజ్‌కుమార్ లేచి ముందుగా చర్చిలో ఫాదర్‌కి ఫోనుచేసి చాలసేపు మాట్లాడేడు. ఆ తర్వాత ఏర్‌పోర్టుకి ఫోనుచేసి తన ప్రయాణాన్ని పోస్టుపోను చేయించుకొన్నాడు. ఆ తర్వాత షికాగో లేక్‌షోరు వద్ద పోలీసుస్టేషన్‌కు ఫోను చేసాడు.

రెండురోజుల తర్వాత విలియమ్స్ తన కొత్త ప్రియురాలి ఆలింగనంలో మత్తుగా తేలిపోతున్నవేళ ఫోను మోగింది. అలా రెండు మూడుసార్లు మోగాక చికాకుగా లేచి ఆ అమ్మాయి ఫోను తియ్యబోయింది.

''ఒద్దు డార్లింగ్ నేను చూసుకుంటాలే'' అని విలియమ్స్ ఆమె చేతిని తొలగించి రిసీవరు తీసి చెవిదగ్గర పెట్టుకున్నాడు.

''హాయ్ విలియమ్స్ హియర్''

''హలో నేను చర్చి నుంచి మాట్లాడుతున్నాను. ఫాదర్ని మాట్లాడుతున్నాను. ఎవరూ విలియమ్సేనా మాట్లాడుతున్నది?''

''అవును ఫాదర్ నేను విలియమ్సనే చెప్పండి...''

''నీ భార్య దొరికింది. నా వద్ద చర్చిలో వుంది. వెంటనే వచ్చి తీసుకువెళ్ళు''

''అలాగే''

అవతల ఫోను పెట్టిన చప్పుడయింది. విలియమ్స్ ఫోను పెట్టేసి బట్టలు వేసుకోసాగాడు.

''ఇప్పుడెక్కడికి డార్లింగ్ ఈ సమయంలోనా'' అంటూ గోముగా అడిగిందామె.

''ఓహ్ తప్పదు డార్లింగ్. అవతల బిజినెస్‌లో ఏదో పెద్ద లాస్ వచ్చేట్టుగా వుంది. అర్జంటుగా వెళ్ళాలి. నా కోసం ఫోన్లు ఏమైనా వస్తే ఇంట్లో లేడనీ ఎక్కడికి వెళ్లాడో తెలియదనీ చెప్పు. ఓ.కే—?''

''ఓ.కే. డార్లింగ్''

చర్చిలో విలియమ్స్ ఆ అమ్మాయిని చూసి ''ఫాదర్ ఈ అమ్మాయి అందంగానే వుంది కాని నా భార్యకాదు.''

''అదెట్లా కుదురుతుంది. ఆమె చెప్పిన తేదీలు నీ పూర్తి వివరాలు పోల్చి చూస్తే అన్నీ సరిగ్గా సరిపోయాయి. నువ్వామెను మీ ఇంటికి తీసికెళ్లు. ఆమె గతాన్ని తలుచుకొని ఇప్పటికే చాలా కుమిలిపోతోంది'' అన్నాడు ఫాదర్.

''డార్లింగ్ ఐయామ్‌సోసారీ. ఆరోజు మనిద్దరం అలా దెబ్బలాడుకోకుండా వుంటే ఇలా జరిగేది కాదు. నిన్ను విడిచి నేనొక్క క్షణం వుండలేను. జరిగిందేదో జరిగిపోయింది. రా మనం మన ఇంటికి వెళదాం'' ఆ అమ్మాయి ప్రాధేయపడ్తున్నట్లుగా దగ్గరగా వచ్చి అంది.

''మనం! మన ఇంటికి వెళదాం! హు. ఎక్కడుంది మనకి ఇల్లు. నాకెక్కడా ఇల్లు లేదు. నా దగ్గర డబ్బులేదు. నువ్వెవరివో నాకు తెలియదు. నా భార్య ఇంకా అందగత్తె. నేనింకో అమ్మాయిని నా భార్య అని నా భార్యను నేను మోసగించలేను. నా భార్య నన్ను అమితంగా ప్రేమించింది. నేనామెను కూడా అంతకన్నా ఎక్కువగా ఇప్పటికీ ప్రేమిస్తున్నాను. నువ్వెవరివో వచ్చి నాకేదో ఆస్తి వుంది హాయిగా అనుభవిద్దామనుకొని నన్ను భర్త భర్త అంటున్నావేమో! అలా జరుగదు. జరగడానికి వీల్లేదు.''

''ఎందుకు వీల్లేదు. ఆమె చెప్పిన వివరాలన్నింటినీ చూస్తే— నువ్వే నీ భార్యని భార్య కాదని అబద్ధ మాడుతున్నట్లు తోస్తోంది. నీకు నీ భార్య కన్పించకపోయినప్పటి నుంచీ మతి స్థిమితం




## కోట్ల భార్య

ఎవరినయినా వొదిలించుకోవాలంటే అంత తేలిక కాదు. కానీ కట్టుకున్న భార్యని వదిలేయడం మన సమాజంలో చాలా రంజీగా భావిస్తుంటారు మగ మహారాజులు. అయితే అప్పుడప్పుడూ కోర్టులు జోక్యం చేసుకొని భార్యలకి భరణాలిప్పిస్తుంటాయి. అలాంటి వాటిని పరిశీలిస్తే ఇంతవరకూ విడాకుల కేసుల్లో పెద్ద మొత్తంలో డబ్బు చెల్లించిన వ్యక్తి దక్షిణాఫ్రికాకి చెందినవాడు. ఇతని పేరు జాన్ శ్లైసింగర్. జాన్ తన మొదటి భార్యకి నాలుగుకోట్ల రూపాయలు, రెండో భార్యకు ఇరవయి రెండు కోట్ల రూపాయలూ మనోవర్తిగా చెల్లించాడట.

పోయింది. అన్నీ మర్చిపోయినట్లున్నావు.'' అన్నాడు ఫాదరు.

''నేను అన్నీ జ్ఞాపకం చేస్తాను. నా భర్తని మళ్లీ మామూలు మనిషిని చేసుకుంటాను ఫాదర్ ఇదంతా నా ఖర్మ. ఆరోజు నేనాయనతో షికాగోలో దెబ్బలాడి వుండి వుండకపోతే....''

''ఏరోజు షికాగోలో... అంటే...''

''అదే జూలై నాలుగవ తేదీ మనం లేక్ షోర్‌లో బోటు షికారు కూడా వెళ్లేము కదా!''

విలియమ్స్ ఆలోచిస్తున్నాడు. ఫాదరు ముందు ఇంకా వాదించి లాభం లేక ''ఫాదర్ నా భార్యని తీసుకువెళ్తున్నాను. మీకు చాలా థాంక్సు.''

ముందే ఇలా జరుగుతుందని వూహించిన ఫాదరు వెంటనే ''ఒద్దు విలియమ్స్ ఆవిడ రెండుమూడు రోజులిక్కడే వుంటుంది. నువ్వుకూడా నీ మనస్సు సరి అయ్యేవరకు ఇక్కడే వుండు.'' అంటూ తన రూములోకి వెళ్లిపోయాడు.

''విలియమ్స్ డియర్'' అంటూ ఆమె విలియమ్స్‌కి దగ్గరగా వచ్చి కౌగిలించుకోబోయింది.

విలియమ్స్ దూరంగా జరిగి ''నువ్వు నా భార్యవి కావు, కావు, కావు'' అంటూ కోపంతో అరచి టేబిలు మీదున్న గ్లాసును తీసి ఎదురుగా డ్రెస్సింగ్ టేబిలువైపు విసిరాడు. ఈ గ్లాసు దెబ్బకి డ్రెస్సింగ్ టేబిలు అద్దం పటపటమని శబ్దం చేస్తూ బద్దలైంది. అక్కడేవున్న వైటరు వచ్చి ''ఏమిటీ పిచ్చిపని'' అంటూ వారించబోయాడు.

''నాకేం పిచ్చిలేదు. మీకే పిచ్చి. మీకందరికీ పిచ్చి'' అంటూ జుట్టు పీక్కుని అరవసాగాడు విలియమ్స్.

''అరవకు అల్లరి చెయ్యకు. నీ కిక్కడ వేళకు కావలసిన సదుపాయాలన్నీ అమరుస్తాము. మనస్సు ప్రశాంతంగా వుంచుకో. నెమ్మదిగా ఆలోచించి చూడు. నీకు గతం అంతా జ్ఞాపకం వస్తుంది.'' అన్నారు అప్పుడే ప్రవేశిస్తూ ఫాదర్.

''నాకన్నీ జ్ఞాపకం వున్నాయి. నాకేం పిచ్చిలేదు. మతి భ్రమించలేదు. మీరు బలవంతాన నాకు లేనివన్నీ అంటగడ్తున్నారు. నన్ను పోనీండి. నన్ను మా ఇంటికి పోనీండి.''

''అలాగే రెండుమూడు దినాలిక్కడ వుండి వెళ్లు ఫరవాలేదు.'' ఫాదరు వెళ్లిపోయాక బాటిల్లోని విస్కీ కొంచెం ఇంకో గ్లాసులో పోసుకొని తాగుతూ ఒక నిర్ణయానికి వచ్చాడు విలియమ్స్.

''ఇదుగో చూడు అమ్మాయ్ నీ పేరేమిటి?''

''అయ్యో దేముడా— మీరు నన్నేకాదు. నా పేరు కూడా మర్చిపోయారా? నేనండీ నేను మీ కెరోనాని.''

''ఓ ... నవ్వు నా భార్య పేరు కూడా కథకి అమరేటట్లు పెట్టుకున్నావున్న మాట.''

''మీరు విశ్రాంతి తీసుకోండి. నేనిప్పుడే లోపలికి వెళ్లి మీకు నచ్చిన వంటకాలు చేసి తెస్తా'' అంటూ కెరోనా

లోపలికి వెళ్ళింది.

ఇంతలో ఆ గదిలోకి విస్కీ బాటిలు చేతిలో పట్టుకొని తూలుతూ ఫాదరు వచ్చి ఏవేవో అస్పష్టంగా మాట్లాడుతూ దబ్బున కిందపడిపోయాడు.

విలియమ్స్ గాభరాగా లేచి అతని వద్దకెళ్ళి లేవదీయబోయాడు. కాని అతనికి వంటిమీాద స్పృహ వున్నట్లు లేదు. ఫాదరు— "విస్కీ బాటిలు— కిందపడిపోవడమా'' అంటూ డాక్టరు కోసం ఫోను చెయ్యాలని అటూ ఇటూ తిరిగి పక్కరూంలో ఫోనువుంటే డాక్టరుకి ఫోను చేసి అర్జంటుగా రమ్మనమని వెనక్కి తిరిగి తన రూములోకి వచ్చి చూసేడు. అక్కడ పడి వుండాల్సిన ఫాదర్ లేరు. 'ఫాదర్ ఫాదర్' అని అరుస్తూ గదంతా కలియ తిరగడం మొదలుపెట్టాడు విలియమ్స్.


ఇంతలో బయటనుంచి డాక్టరు— ఫాదరు తన రూములోంచి పక్క గదిలోంచి కెరోనా ఇలా అందరూ వచ్చి ''ఏమైంది ఏమైంది ఫాదర్ ఫాదర్ అని అరుస్తున్నారు'' అని ఆత్రంగా అడిగారు.

''డాక్టర్ ఫోను మీాకు నేనే చేసాను. ఫాదర్ ఇక్కడే ఏదీ విస్కీ బాటిలు— ఇక్కడే పడి వుండాలే... ఏదీ... ఏదీ'' అంటూ విలియమ్స్ బాటిలు కోసం వెదకనారంభించాడు.

''ఏంటి డార్లింగ్ మరీ పిచ్చిపనులు.''

''పిచ్చి పనులు కావు. నిజంగా విస్కీ ఎక్కువ తాగి తూలుతూ వచ్చి ఫాదర్ ఇక్కడే పడిపోయారు స్పృహ తప్పి పడిపోయారు. నేను ముక్కు దగ్గర వేలుంచి కూడా చూసాను. శ్వాస ఆడినట్లు అన్పించకపోతే ఫోనుకోసం వెతికి అదుగో ఆ పక్క గదిలో ఫోనులో డాక్టరుతో మాట్లాడేను.''

''ఏమిటీ నేను... నేను... విస్కీ బాటిలుతోనా— నీ గదిలోనా... జీసస్ విలియమ్స్‌ని రక్షించు. విలియమ్స్‌ని



రక్షించు. అతనికి మతిస్థిరం కలిగేటట్లు చెయ్యి.''

''నాకు మతిస్థిరంగానే వుంది. నాకేం పిచ్చి లేదు. ఇక్కడే వుంటే నాకు లేని పిచ్చి వచ్చేటట్లు వుంది.''

''నువ్వు రెస్టు తీసుకో విలియమ్స్. మే గాడ్ బ్లెస్ యూ చైల్డ్. మే గాడ్ బ్లెస్ యూ...'' అంటూ ఫాదరూ అతనితో మిగతా వాళ్లు కూడా నిష్క్రమించారు.

కెరొనా ప్లేటులో తనకిష్టమైనవని చెప్పి తెచ్చిన ఆహారపదార్థాలు అస్సలు తనకిష్టం లేనివి. వీళ్ళంతా బలవంతాన తనకి అన్నీ అంటగట్టడానికి ప్రయత్నిస్తున్నారు. విసుక్కుని విసుక్కుని కాస్సేపటికి నిద్రకు ఉపక్రమించాడు విలియమ్స్.

విలియమ్స్ నిద్ర లేచేసరికి బాగా పొద్దెక్కింది. కెరొనా ఎవరితోటో ఫోనులో గట్టిగా మాట్లాడుతోంది. బహుశ తను వినడంలేదనుకొని చెప్తోందో ఏమో! దేనికో తెలియదు కాని ఎన్నివేలు ఖర్చయినా ఫరవాలేదంటోంది ఫోనులో.

''నేను మీకు చెక్ ఇస్తే చాలా కాషియ్యాలా?'' అవతలి వ్యక్తి క్యాషే కావాలని అన్నట్లున్నాడు.

''అయితే నేను రేపే బాంకుకి వెళ్ళి మీరడిగిన అన్ని వేలూ క్యాష్ తీసుకువచ్చి ఇస్తాను. మీరు నన్ను బ్యాంకుకి తీసుకువెళ్లక్కరలేదు. మా వారిక్కడే వున్నారు. ఆయనే నన్ను స్వయంగా కారులో తీసుకువస్తారు. మీకు డబ్బియ్యడం ముఖ్యం అంతేకదా!'' కెరొనా ఫోను పెట్టేసింది.

ఆమె విలియమ్స్ గదిలోకి వచ్చేసరికి ఇంటర్‌కామ్ టెలిఫోనులో వింటున్న విలియమ్స్ కూడా ఫోను చటుక్కున పెట్టేసాడు. ''ఇదిక్కడున్నట్లు ఇప్పుడే చూసాను'' సంజాయిషీగా అన్నాడు విలియమ్స్.

''డార్లింగ్ అన్నీ విన్నారుగా. రేపు నన్ను మీరు బ్యాంకుకి తీసికెళ్ళాలి. నేనొకలాయరుకి నలభైవేల డాలర్లు అర్జంటుగా ఇవ్వాలిట. ఆ డబ్బు ముందు ఇస్తేనేకాని మిగతా ఆస్తిపాస్తుల వివరాలు చూడనంటున్నాడు మరి. తీసికెళ్తారుగా'' అంటూ ఒయ్యారంగా అడిగిన కెరొనాని చూసి విలియమ్స్...

''నువ్వు నా భార్య పేరు పెట్టుకున్నంత మాత్రాన ఆమె బ్యాంకు ఎక్కౌంటులో డబ్బు తీసుకోగల ననుకుంటున్నావా? చెక్‌బుక్ అవీ నా దగ్గిరే వున్నాయి. నేను నిన్ను ఒక్క సెంటు కూడ ముట్టుకో నివ్వను తెలిసిందా?''

''పోనీలే! నీకు వీలులేకపోతే రెస్టుతీసుకో. నన్ను లాయరే తీసికెళ్తారు'' అంటూ కెరొనా పర్సులోంచి చెక్‌బుక్ తీసి నలభయివేల డాలర్లకి సంతకం చేసి ఫోనుచేసి లాయర్ని రమ్మనమంది.

విలియమ్స్‌కి వళ్లు మండిపోతోంది. ''ఆమె ఆ డబ్బు క్యాష్ చెయ్యడానికి వీలు లేదు. ఆమె నా భార్య కాదు. అంతా మోసం అని బ్యాంకు వాళ్లకి చెప్పాలి. ఎలా? ఎలా...''

ఇంతలో లాయరు వచ్చి ''హాయ్ కెరొనా ఆర్ యూ రెడీ'' అంటూ ఆమె చెయ్యి పట్టుకొని ఆమె నడుం చుట్టూ

చేయివేసి నడిపించుకొని కారుదాకా వెళ్లి ఆమె కూర్చున్నాక ఆ డోర్ వేసి తను డ్రైవింగ్ సీటులో కూర్చుని కారు స్టార్టు చేసాడు.

అంతా నిముషాల్లో విలియమ్స్ కళ్లముందు జరిగిపోయింది. ఇంక విలియమ్స్ వుండలేక అడ్డం వచ్చిన వెయిటరును కొట్టి చర్చిలోంచి బయటపడి తన కారు తీసుకొని బ్యాంకుకి బయలుదేరాడు.

విలియమ్స్ బ్యాంకుకి చేరేసరికి లాయరు, కెరొనా బ్యాంకు అధికారితో ఏదో వాదిస్తున్నారు.

''ఈ చెక్ చెల్లదంటున్నారు డార్లింగ్. నువ్వు టైముకి వచ్చేవు కనుక సరిపోయింది. ఇదుగో ఇక్కడ 'ఈమె నా భార్య కెరొనా' అని రాసి సంతకం పెట్టేస్తే చెల్లుతుందట. ప్లీజ్ త్వరగా పెట్టు అంటూ చెక్ బుక్కు రశీదు అందించింది కెరొనా విలియమ్స్‌కి.

''ఈమె నా భార్య కాదు. ఛస్తే ఎక్కడా సంతకాలు పెట్టను. ఆస్తి మొత్తం అంతా నాకే చెందుతుంది. నేనెవ్వరికీ ఒక్క పైసాకూడా ఇవ్వను''

''అదేమిటి డార్లింగ్ నా డబ్బు నేను వాడుకోడానికి నీ పర్మిషను నాకక్కరలేదు. లాయరుగారు చెప్పకపోతేపోనీ, ఫాదరు సంతకం పెడ్తారు నేను నీ భార్యనేనని...''

అప్పుడే లోపలికి వచ్చిన ఫాదర్ ''నేను అలా పెడ్తే ఈమె డబ్బు ఈమెకిస్తారా'' అని చెక్ తీసుకొని సంతకం పెట్టబోతూ బ్యాంకు అధికారుల్ని అడిగారు ఫాదర్.

''ఇచ్చేస్తాము. ఇంత పెద్ద మొత్తం ఒకేసారి తీసుకుంటున్నారు కనుక అలాంటి సంతకాలు మాకు చాలా అవసరం'' అధికారి అన్నాడు.

ఫాదరు పెన్ను తీసి సంతకం పెట్టబోయాడు.

''వీల్లేదు'' అరిచాడు విలియమ్స్.

''ఎందుకు వీల్లేదు''

''ఈమె నా భార్య కాదు కనుక''

''ఎందుకు కాదు. మేం పోలీసు సహాయంతో కష్టపడి వెతికి తెచ్చాం కదా!''

''మీరు వెతికి తెచ్చామనుకొన్న ఈమె ఇంకెవరి భార్యోకాని నా భార్య మాత్రం కాదు.''

''అయితే నీ భార్య ఏమైంది. నువ్వబద్ధం చెబుతున్నావు. ఈమె నీ భార్య కాదని



## పిల్లలు

ఎనిమిది మంది పిల్లల్తో బస్సెక్కింది సంతానలక్ష్మి.

''అందర్నీ వెంటబెట్టుకు రాకపోతే కొంతమందిని ఇంట్లో వదిలి రావచ్చుగా'' విసుక్కున్నాడు కండక్టర్.

''ఆ మాత్రం నాకు తెలుసులేవయ్యా. మిగతా ఆరుగుర్ని ఇంటి దగ్గరే వదిలివచ్చాను'' చెప్పింది సంతాన లక్ష్మి.

—ఎస్.శక్తినాథ్ (బాపట్ల)

ఈమెని వెళ్లగొట్టి ఆమె ఆస్తి మొత్తం రాబట్టుకుందా మనుకుంటున్నావు కదూ! అలా సాగకుండా ఆమె తనే వచ్చి స్వయంగా డబ్బు క్యాష్ చేసుకుంటూంటే నీకు కష్టంగా వుందా?'' లాయరు అడిగాడు.

''ఈమె కెరొనా కావచ్చుకాని నా భార్య మాత్రం కాదు. కాదు కాదు.''

''విలియమ్స్! అయితే నీ భార్య ఏమైంది?''

''చచ్చిపోయింది. నా చేతులతో నేనే పీక నులిమి చంపి లేక్‌షోర్‌లో పడవేసి వచ్చాను. ఆమె చాలా అందగత్తె. అంత అందాన్ని నేను భరించలేకపోయాను. పైగా బోలెడు డబ్బుకి వారసురాలు. ఆమె చచ్చిపోతే భర్తను కనుక ఆమె ఆస్తి అంతా నాకే దక్కుతుందని ఆశతో అలా చేసాను. ఈమె నా భార్య కానే కాదు...''

కెరొనా చెక్‌ని ముక్కలు ముక్కలు చేసి చెక్‌బుక్‌ని బాంకులో అధికారికిచ్చి ''థాంక్స్'' అంది.

ఇన్స్‌పెక్టరు విలియమ్స్ చేతికి బేడీలు వేస్తూంటే ఫాదర్ ఆమెను లాయరు భార్యగా పరిచయం చేసాడు. అప్పుడే వచ్చిన డిటెక్టివ్ జేమ్స్ డిటెక్టివ్ రాజ్‌కుమార్‌ని అభినందిస్తూ కరచాలనం చేసాడు.

''ప్రొఫెసరు రవి కనుక షికాగోలో మనకి పరిచయమైన వాళ్లు అని క్లూ ఇవ్వకపోతే ఈ కేసు ఇంత తొందరగా తేలేది కాదేమో! నేను ముందు చూ రవికి థాంక్స్ చెప్పుకోవాలి'' అని ఫాదరువైపు తిరిగి.

''ఫాదర్ మీకు చాలా శ్రమ ఇచ్చేము. మమ్మల్ని మన్నించండి.''

''నాకేం శ్రమలేదు. ఒక సత్కార్యం కోసం మీతో చేతులు కలపడంలో నాకూ తృప్తి, మనశ్శాంతి వున్నాయి. ఇంక పోదాం పదండి'' అని అందర్నీ బయలుదేర తీసాడు ఫాదర్.

ఇంటికొచ్చిన డిటెక్టివ్ రాజ్‌కుమార్‌ని ప్రొఫెసర్ రవి ఈ కేసును ఇంత వేగంగా ఎలా సాల్వ్ చేసావని అడిగారు.

ఫ్రిజ్‌లోంచి బాటిల్ తీసి గ్లాసులలోపోస్తూ రాజ్‌కుమార్ ''ఏముందీ సింపుల్'' అంటూ గ్లాసందించి చెప్పసాగాడు.

''నువ్వు బయటికి వెళ్లగానే నేను చర్చిలో ఫాదర్‌కి, షికాగో లేక్‌షోర్ దగ్గర పోలీసుస్టేషనుకు ఫోన్లు చేసాను. అక్కడి పోలీసు ఇన్స్‌పెక్టరుకు లేక్‌షోరులో ఒక శవం దొరికిందనీ దానిని వాళ్లు పోస్టుమార్టమ్‌కు పంపామనీ చెప్పారు. తర్వాత రిజల్ట్సు వచ్చాయనీ ఎవరో పీక నులిమి చంపి ఆమెను ఆ నదిలో పారవేసారనీ, రెండురోజులు శవాన్ని వుంచి హక్కుదారులు ఎవరూ రానందున వారే ఎలక్ట్రిక్ క్రిమేషను చేసామనీ చెప్పాడు. వెంటనే నేను నా పేరు ఎడ్రసు ఇచ్చి, ఈ కేసు వివరాలన్నీ చెప్పి ''అవసరమైనప్పుడు ఫోను చేస్తాను అతనిని అరెస్టు చేసుకోండి'' అని చెప్పేను. తర్వాత చర్చిలో ఫాదర్ సాయంతో లాయరుగారితో మాట్లాడి ఆయన భార్యని కెరొనాలా నటించమని అడిగాను. విలియమ్స్‌కి మతి భ్రమించిందని పదే పదే చెప్పించడం చేత ఆ బాధ నుంచి తప్పుకోడానికి, కెరోనా బ్యాంకునుంచి

అంత పెద్ద మొత్తం తన భార్య పేరుతో వున్నది పట్టుకుపోవడానికి ఒప్పుకోకుండా వుండడానికి అతను అతని నోటితోనే నిజాన్ని ఒప్పేసుకున్నాడు.''

''అది సరే రాజ్ కుమార్ ఒక్క విషయం చెప్పు. అసలు అతను అతని భార్యను చంపేసి వుంటాడన్న అనుమానం నీకెలా వచ్చింది''— అడిగాడు ప్రొఫెసర్

''ఎలాగూ అంటే విలియమ్స్ ఫోనులో నాతో మాట్లాడి పెట్టేటప్పుడు ఒక ఆడగొంతు విన్పించింది. పైగా పెద్ద పనున్నవాడిలా ఎక్కువ సేపు మాట్లాడకుండా ఎంత డబ్బు కావాలన్నా ఇస్తానంటూ ఫోను పెట్టేసాడు విలియమ్స్ పోలీసులకి తెలిస్తే వాళ్లు ముందు ఆరాలన్నీ తీసి అతనిమీద నిఘావేసి వుంచుతారు. అందుకే ముందు డిటెక్టివ్ ని పట్టుకున్నాడు.''

''నీ ఆటోమేటిక్ కెమేరా తీసిన ఫోటోలోని అమ్మాయి అతని ప్రేయసియేనా?''

''ఎంతమాత్రం కాదు. కేవలం ఆ రోజు డబ్బు కాగితాలు నా వద్దకు పంపేవరకే ఆ అమ్మాయిని నియమించుకొన్నాడు. ఇటువంటి వాళ్ళు సాధారణంగా తమకి ఎంతమంది ప్రేయసులు ఎక్కడెక్కడున్నారో ఎవరికీ చెప్పరు.

భార్య అందగత్తే అయినా డబ్బుని అతనికి నచ్చినట్లు విచ్చలవిడిగా ఖర్చు చేయనిచ్చి వుండదు. అందుకే అతను తన భార్యను గొంతు నులిమి చంపాడు.''

''అంతా బావుంది కాని రాజ్ కుమార్ ఈసారి వచ్చినపుపడు మా చెల్లాయ్ జయశ్రీని కూడా తీసుకురా! ఫ్లోరిడా వెళ్లివద్దాము.'' అన్నాడు ప్రొఫెసర్ రవి.

ఈసారి ఏ కేసూ నెత్తిన పెట్టుకోకుండా వస్తాములే— అన్నాడు డిటెక్టివ్ రాజ్ కుమార్.

శుభం

## బరువుపనులు నిషేధం



స్త్రీలు గర్భిణీలయిన సమయాల్లో బరువు పనులు చేస్తే ప్రసవం సులభంగా అవుతుందని చెప్తారు డాక్టర్లు. కాని నికోబార్ దీవుల్లోని స్త్రీలు గర్భిణీలుగా వున్నప్పుడు బరువు పనులు చేయరు. వీరితోపాటు భర్తలు కూడా బరువు పనులు చేయరు. గర్భిణీ స్త్రీ భర్త భూతవైద్యుడికి చేత కొబ్బరికాయలు, ఆకులు, కొబ్బరి నూనె ఇవ్వాలనే నియమం వుంది ఇక్కడ.